క్లుప్తంగా

వైద్య శిబిరంలో 210 మందికి సేవలు

పెరవలి: మండలంలోని లంకమాలపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇక్కడి క్రీస్తు లూథరన్ సంఘం ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటైంది. తణుకు పట్టణానికి చెందిన సన్ హాస్పిటల్ వైద్యుడు ఎస్.శోభాశరన్ శిబిరానికి హాజరైన 210 మంది రోగులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఈసీజీ, సుగర్ వంటి పరీక్షలు కూడా నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం గొడుగులు పంపిణీ చేశారు. విశ్రాంత ప్రిన్సిపాల్ తిరుగు భీమేశ్వరరావు ఈ గొడుగులను సమకూర్చారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దుర్గా సూర్యనారాయణ చేతుల మీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కోటిపల్లి సరోజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిడదవోలు టౌన్ ఎస్సైగా శోభన్‌కుమార్



నిడదవోలు: పట్టణ ఎస్సైగా పశుపులేటి శోభన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ జిల్లా కరప మండలం నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎస్సైగా పని చేసిన పి.అప్పలరాజు పెరవలి మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్సై శోభన్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

తాడిపూడి లిఫ్ట్ -2 నుంచి నీటి విడుదల

గోపాలపురం. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఎకరాకు నీరందించే బాధ్యత ప్రభుత్వానిదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శుక్రవారం ఆయన గోపాలపురంలో తాడిపూడి ఎత్తిపోతల పథకం లిఫ్టు- 2 నుంచి నీటిని ఆయకట్టుకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని అందించడం ద్వారా మెట్ట ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మొక్కలు నాటారు. గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. ఈయన వెంట టీడీపీ మండల నాయకులు ఉన్నారు.

నైట్ అలవెన్సులు పునరుద్ధరించాలంటూ నిరసన

కొవ్వూరు: తమకు నైట్ అవుట్ అలవెన్సులను పునరిద్ధరించాలని కోరుతూ, ట్రెజరీ అధికారుల వైఖరికి నిరసనగా ఆర్టీసీ కార్మికులు శుక్రవారం సాయంత్రం స్థానిక డిపో గ్యారేజీ గేటు ఎదుట నిరసన తెలిపారు. ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం చే పట్టామని రీజినల్ అధ్యక్షుడు ఎస్‌డీ ముఖర్జీ తెలిపారు. ఎన్ఎంయూ డిపో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శివకుమార్, ఎ.రాజు,ఇతర సభ్యులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం



రాట ముహూర్తం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: పట్టణంలోని యాదవుల వీధిలో నిర్వహించే గణపతి నవరాత్ర మహోత్సవాలకు శుక్రవారం మామిడి తోరణాలు, పసుపు కుంకుమలతో రాట ముహూర్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై, కొబ్బరికాయ కొట్టి గణపతి నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, జనసేన పట్టణ శాఖ అధ్యక్షుడు రంగా రమేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చాగల్లులో వీహెచ్‌పీ షష్ట్యబ్ది వేడుక

చాగల్లు: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఏర్పడి 60 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం చాగల్లు పాటమ్మ తల్లి కల్యాణ మండపంలో షష్ట్యబ్ది ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీహెచ్‌పీ అఖిల భారత కేంద్ర సభ్యుడు గొల్లపూడి శ్యాం ప్రసాద్ ముఖర్జీ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ మన సంస్కృతీ వ్యవహారంగా సవ్యంగా నడవాలన్నారు. ఆ ఉద్దేశంతోనే హిందువుల నుంచి మత మార్పిడి జరగకుండా నివారించేందుకు పరిషత్ అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వీహెచ్‌పీ కొవ్వూరు శాఖ అధ్యక్షుడు గ్రంధి రాంబాబు, లింగాల శ్రీనివాస్ శర్మ పాల్గొన్నారు.

ఇటు జ్వరాలు.. అటు ముసురు

- ఫీవర్లతో ఆసుపత్రులకు క్యూ కడుతున్న జనం
- వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో వర్షాలు
- పారిశుధ్యం లోపిస్తే సీజనల్ వ్యాధులు మరింతగా ప్రబలే ముప్పు



కొవ్వూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు



కొవ్వూరు మండలం వేములూరు వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు



కొవ్వూరు పట్టణంలోని తహసీల్దార్ ఆఫీసు ఎదురుగా పొంగి ప్రవహిస్తున్న డ్రైన్

కొవ్వూరు: అసలే వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా పదుల సంఖ్యలో జర్వ పీడితులు మంచం పట్టి మూలుగుతున్నారు. ఎవరిని కదిపినా దగ్గు, జలుబు, జర్వం, టైఫాయిడ్, వంటి నొప్పులు అని చెబుతున్నారు. వారంతా ఆసుపత్రుల బాట పడుతున్నారు. ఏ ఆసుపత్రిలో చూసినా జర్వం పీడితులే అధికంగా ఉంటున్నారు. ఇలాంటి తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ముసురు పట్టింది. మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే పేర్కొంది. శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. ఇప్పటికే గ్రామాల్లో పారిశుధ్యం అంతంత మాత్రం. ఒక వైపు వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో పారిశుధ్యం క్షీణిస్తే మరిన్ని సమస్యలు తలెత్తే ముప్పు ఉంది. పల్లెల్లోనే కాదు, కొవ్వూరు పట్టణంలోనూ కలుషిత తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పైప్ లైన్ల లీకేజీల వల్ల ఎక్కడికక్కడ తాగునీరు కలుషితం అవుతోంది. దీంతో పట్టణ వాసులు మరింత ఆందోళన చెందుతున్నారు.

రోగుల్లో సగం మందికి జ్వరాలు

ఆసుపత్రులకు వచ్చే రోజువారీ రోగుల్లో 50 శాతం మంది జ్వర పీడితులే ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి సగటున రోజుకు 250 నుంచి 300 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారు. వైద్యానికి సుమారు వంద మంది వస్తే వారిలో యాభై మంది వైరల్ జ్వర పీడితులే ఉంటున్నారు. వారిలో రోజుకు 10 నుంచి 15 మంది ఆసుపత్రిలో చేరుతున్నారు.

ప్రస్తుతం కొవ్వూరు సీహెచ్‌సీలో 30 మంది వరకూ ఇన్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. ఇక గౌరీపట్నం పీహెచ్‌సీ పరిధిలోని ఐ.పంగిడిలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించగా, వారిలో ఐదుగురికి వైరల్ ఫీవర్లతో బాధపడుతున్నట్టు గుర్తించారు. దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలోని పెనకనమెట్టలో ఐదుగురు, వేములూరులో తొమ్మిది మంది, వాడపల్లిలో నలుగురు జ్వర పీడితుల నుంచి వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. వాడపల్లి శిబిరంలో 42 మంది, వేములూరు శిబిరంలో 45 మంది వైద్య సేవలు పొందారు. దొమ్మేరు పీహెచ్‌సీలో రోజువారీ ఓపీ 70 నుంచి 80 వరకూ నమోదవుతోంది. వారిలో కనీసం ఐదుగురి నుంచి పది మంది వరకూ జ్వర పీడితులు ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ రోజులు జ్వరంతో బాధపడిన వారిలో అత్యధికులు టైఫాయిడ్ బారిన పడుతున్నారని ఆసుపత్రుల గణాంకాలు చెబుతున్నాయి. ఇక ఆర్ఎంపీలు, పీఎంపీలతో పాటు చిన్నా, పెద్దా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సీజనల్ జ్వరాలకు చికిత్స పొందే వారి సంఖ్యా ఎక్కువగానే ఉంటోంది.

వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం



దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలోని పెనకనమెట్ట గ్రామంలో ఇప్పటికే వైద్య శిబిరం నిర్వహించాం.శుక్రవారం వాడపల్లి, వేములూరు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం. గౌరీపట్నం పీహెచ్‌సీ తరఫున ఐ.పంగిడి గ్రామంలోనూ వైద్య శిబిరం నిర్వహించాం. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ కాచి చల్చార్చిన నీటిని మాత్రమే తాగాలి. జర్వం వస్తే తక్షణమే సమీపంలోని ఆసుపత్రిలో చూపించుకోవాలి. సకాలంలో రక్త పరీక్షలు చేయించుకోవాలి.

–ఎస్.ధర్మరాజు, వైద్యాధికారి, దొమ్మేరు పీహెచ్‌సీ, కొవ్వూరు మండలం

మొక్కలను సంరక్షిస్తే పర్యావరణ హితం

- మంత్రి కందుల దుర్గేష్
- వలు ప్రాంతాల్లో 'వనం.. మనం' కార్యక్రమం
- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు



నిడదవోలు జెడ్పీ హైస్కూల్ మైదానంలో మొక్క నాటుతున్న మంత్రి కందుల దుర్గేష్



కొవ్వూరు బైపాస్ రోడ్డులో వనం-మనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

నిడదవోలు: మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణకు మన వంతు బాధ్యతను సక్రమంగా నిర్వహించినట్టే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం వనం - మనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దుర్గేష్ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ టీఎల్‌పీఎస్‌ఎస్ కృష్ణవేణి, ఎంపీడీఓ, పి.శామ్యూల్, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, మున్సిపల్ ఏఈ ఎస్.హేమంత్, ఎంఈఓ కేఎస్‌వీ గురుమూర్తి, హెచ్ఎం సీహెచ్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ ధమ్మ పీఠంలో..

ఉండ్రాజవరం: స్థానిక బౌద్ధ ధమ్మపీఠం మైత్రేయ బుద్ధ విహారలో జరుగుతున్న ఆశ్రమ నిర్మాణ పనులను శుక్రవారం మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. అనంతరం బౌద్ధ భిక్షువు బంతె అనాలియో ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో పాల్గొన్నారు. బౌద్ధ ధమ్మ పీఠం ఆవరణలో మొక్కలు నాటారు. స్థానికులకు మంత్రి దుర్గేష్ పూల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, నాయకులు గన్నమని వెంకట సుబ్రహ్మణ్యం, కుదప చక్రపాణి, వీరమల్లు బాలాజీ, బూరుగుపల్లి శివరామ కృష్ణ, ధమ్మపీఠం సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొవ్వూరు: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా భావించి మొక్కలు పెంచాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. 'వనం-మనం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని మినీ బైపాస్ రోడ్డులోని కాటన్ విగ్రహం జంక్షన్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించే బాధ్యత మునిసిపాలిటీ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, నాయకులు బీవీ ముత్యాలరావు, నీరుకొండ సూర్యనారాయణ, పిల్లలమర్రి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఆధ్వర్యంలో వాడపల్లిలో..

ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) ఆధ్వర్యంలో వాడపల్లి గ్రామంలోని గోదావరి ఒడ్డునే గల ఖాళీ స్థలంలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. వాడపల్లి సర్పంచ్ గెల్లా ప్రసాద్, ఎంపీడీవో కె.సుశీల, పంచాయతీ, ఎన్ఆర్ ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కుమారదేవంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రాంగణంలోనూ మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ పి.సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ప్రాంగణంలో మొక్కలు నాటారు.

వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో..

తాళ్లపూడి: 'వనం-మనం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు చేతుల మీదుగా కళాశాల ఆవరణలో కొబ్బరి, ఇతర పండ్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, అధ్యాపకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి



కొవ్వూరు తహసీల్దార్ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొవ్వూరు: యూపీఎస్, జీపీఎస్, సీపీఎస్‌లను రద్దు చేసి, ఆ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. జయకర్ మాట్లాడుతూ 2004 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వోద్యోగులకు, 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు న్యూ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమలు చేయాలన్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ విధానం ఉద్యోగుల హక్కు అన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల యుటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపులు పరిశీలించిన జేసీ

- కొవ్వూరు ర్యాంపు మూసివేయాలని ఆదేశం
- ప్రత్యామ్నాయ ర్యాంపు చూడాలని సూచన
- సెప్టెంబర్ 11 నుంచి ర్యాంపులు తెరిచేందుకు సన్నాహాలు



ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, ఇతర అధికారులు

కొవ్వూరు: బోట్స్‌మన్ సొసైటీల ద్వారా నడిచే కొవ్వూరులోని ఇసుక ర్యాంపుల స్థితిగతులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. సెప్టెంబర్ 11 నుంచి ఇసుక ర్యాంపులు తెరుచుకోనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలోని సౌకర్యాలు, ఇబ్బందులను పరిశీలించేందుకు ఆయన కొవ్వూరు వచ్చారు. గతంలో ర్యాంపుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు గురించి జేసీ ఆరా తీశారు. ఒక వేళ ర్యాంపుల్లో పని చేయని సీసీ కెమెరాలుంటే పునరుద్ధరించాలని ఆదేశించారు. ఒక వేళ ర్యాంపుల్లో బయటకి, లోపలకు వెళ్లే మార్గాలు రెండు ఉంటే, ఒక మార్గాన్ని మూయించి వేయాలని సూచించారు. కొవ్వూరు ఇసుక ర్యాంపు పట్టణాన్ని ఆనుకుని ఉన్నందున, మెయిన్ రోడ్డులో ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా ఉన్నందున మూసివేయాలని జేసీ ఆదేశించారు. ప్రత్యామ్నాయంగా మరొక ర్యాంపు చూడాలని అధికారులకు సూచించారు. ఇసుక రవాణాలో అక్రమాలకు తావు లేకుండా పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. పడవల యజమానులకు టన్నుకు ఎంత రేటు చెల్లిస్తారనేది ఇంకా స్పష్టత లేదు. రెండు రోజుల క్రితం జాయింట్ కలెక్టర్ బోట్స్‌మన్ సొసైటీలతో నిర్వహించిన సమావేశం లోనూ టన్నుకు ఎంత ధర చెల్లిస్తారన్న అంశంపై తర్జనభర్జనలు జరిగాయి. బోట్స్‌మన్ సొసైటీకి టన్నుకు ఎంత ధర చెల్లించేదీ స్పష్టం చేయకుండా ర్యాంపులు తెరిచేందుకు సన్నద్ధం అవుతుండడంపై విమర్శలు వస్తున్నాయి. జేసీతో పాటు అధికారుల బృందం దండగుండరేవు, కొవ్వూరు, ఎరినమ్మ, ఔరంగాబాద్, వాడపల్లి ఇసుక ర్యాంపులను పరిశీలించారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, హెడ్ వర్క్స్ డీఈఈ యు.రమేష్‌బాబు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో భక్తుల రద్దీ



అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెరవలి: శ్రావణ మాసంలోని ఆఖరి శుక్రవారం కావడంతో మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు సామూహికంగా శ్రావణ గౌరీ వ్రతాలు ఆచరించారు. అలాగే మండలంలోని కానూరు, కాకరపర్రు, ఖండవల్లి గ్రామాల్లోని కనకదుర్గమ్మ వారి ఆలయంలో తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మందితో శ్రావణ వ్రతాలు ఆచరించారు.

విశేష అలంకరణలో కనకదుర్గమ్మ

ఉండ్రాజవరం: శ్రావణ మాసంలోని చివరి శుక్రవారం సందర్భంగా మండలంలోని పలుచోట్ల కొలువైన దేవతామూర్తులు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పాలంగి, ఉండ్రాజవరం, మోర్త గ్రామాల్లోని కనకదుర్గమ్మ వార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, విశేష పూజలు, వ్రతాలు నిర్వహించారు. పాలంగిలోని కనకదుర్గమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేలివెన్ను, సూర్యారావు పాలెం, దమ్మెన్ను, కె.సావరం గ్రామాల అమ్మవారి ఆలయాలకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కొవ్వూరు: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మహిళలు శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం, మాస పూజ నిర్వహించారు. వాసవీ అమ్మవారికి పూలు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించారు. శ్రావణ ద్వాదశి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, వాసవీ ట్రస్టు, వాసవీ క్లబ్, వజ్ర వనిత వాసవీ క్లబ్, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. సంఘాధ్యక్షుడు మద్దుల సోమరాజు, నాయకులు మట్టే ప్రసాద్, కక్కిరాల సూరిబాబు, వలివేటి ప్రసాద్, నాళం వీర వెంకట శ్రీనివాసరావు, తుమ్మలపల్లి రమేష్, దేవాతు కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కె.సావరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీదుర్గామాత

చాగల్లు: మండలంలోని చాగల్లు, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, మార్కొండపాడు తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలను భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. చాగల్లు సుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణం వద్ద గల శ్రీ ధనలక్ష్మీ దేవాలయం ప్రాంగణంలో శుక్రవారం భారీఎత్తున అన్న సమారాధన చేసినట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కారుమూరి గుప్తా తెలిపారు.

పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు



తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అన్నపూర్ణ

నల్లజర్ల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలంలోని పోతవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం సుభద్రపాలెం, నబీపేట గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో తొలుత గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్ సర్వేను పరిశీలంచారు. గ్రామంలోని పారిశుధ్యాన్ని పరిశీలించారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో దాదాపు 100 మంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రాజశేఖర్ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సువార్త, ఏఎన్ఎం భారతి, సూపర్‌వైజర్ సత్యం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లజర్లలో..

అలాగే నల్లజర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి తెల్లం గంగాధరరావు ఆధ్వర్యంలో జగన్నాథపురం గ్రామంలో 75 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనుమానిత జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఎంఎల్‌హెచ్‌పీ సాహిత్య, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి నాగరాజ్యం, ఆరోగ్య సహాయకుడు రాఘవ, ఆశా కార్యకర్తలు స్వరూపరాణి, జ్యోతి, సుజాత పాల్గొన్నారు.



నల్లజర్ల మండలం జగన్నాథపురంలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి గంగాధరరావు



ఉండ్రాజవరం మండలం తాడిపర్రు శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉషాదేవి

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల నియంత్రణకు వివిధ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. తాళ్లపూడి పీహెచ్‌సీ పరిధిలోని తాళ్లపూడి, వేగేశ్వరపురం, పోచవరం గ్రామాల్లో వైద్యాధికారి హారికాగుప్తా ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. అలాగే మలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.అన్నపూర్ణ, పి.సుచందన ఆధ్వర్యంలో తిరుగుడు మెట్ట, రావూరుపాడు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు అన్నపూర్ణ, హారికాగుప్తా మాట్లాడుతూ ఈ శిబిరాల్లో 110 మంది రోగులకు చికిత్స అందించామన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే నిర్వహిస్తూ, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారన్నారు. వైద్య శిబిరాల్లో ఎంపీహెచ్‌ఈవోలు ఎం.వెంకటేశ్వరరావు, ఎస్.రమేష్, బి కృపావరం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిపర్రు గ్రామంలో..

ఉండ్రాజవరం: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తాడిపర్రు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.ఉషాదేవి శిబిరానికి హాజరైన రోగులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వర పీడితుల నుంచి వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వచ్చే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల గురించి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం రోగులకు అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిబిరంలో ఆరోగ్య పర్యవేక్షకుడు జిన్నూరి శ్రీనివాసు, మహిళా ఆరోగ్య కార్యకర్త శివపార్వతి, ప్రశాంతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలో 155 మందికి..

దేవరపల్లి: మండలంలోని యాదవోలు పీహెచ్‌సీ పరిధిలోని యర్నగూడెం, చిన్నాయగూడెం, యాదవోలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆ పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ హరిచందన ఆధ్వర్యంలో చిన్నాయగూడెంలో 80 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 13 మందికి వైరల్, టైఫాయిడ్ జ్వరాలుగా నిర్ధారించి మందులు అందజేశారు. ఇక యర్నగూడెం వైద్య శిబిరంలో 75 మందికి పరీక్షలు చేయగా, వారిలో 12 మందికి జ్వరాలు ఉన్నట్టు నిర్ధారణ అయినట్టు డాక్టర్ హరిచందన తెలిపారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో గ్రామాల్లో ఇంటింటా జ్వరాల సర్వే జరుగుతోందని చెప్పారు.

నిడదవోలు రూరల్: మండలంలోని ఉనకరమిల్లి, సమిశ్రగూడెం గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. తాడిమళ్ల పీహెచ్‌సీ వైద్యురాలు ఆశాలత 178 మంది రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈఓలు ఎ.రాజమోహన్, రమణ, దేవదాసు, పీహెచ్ఎన్ ఎమెలీయమ్మ, హెచ్‌వీ రత్నమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.